# పిల్లల పెంపక విజ్ఞానం - పెద్దల బాధ్యత

**సి. కేశవులు** , B.Sc., B.Ed.,
**విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు, చిత్తూరు.**

**అభిప్రాయం**

శ్రీ కేకలతూరి క్రిష్ణయ్య గారు బహు గ్రంథకర్త. ఈయన రచనలన్నీ వైవిధ్యభరితమైన అంశములతో కూడుకొన్నవి. నా దృష్టిలో ఈయన జీవితమే వైవిధ్యభరితమైనది. శ్రీ కె. క్రిష్ణయ్య గారు ఒక ప్రభుత్వ ఉద్యోగి, ఒక క్రీడాకారుడు, ఒక ప్రైవేటు ఉద్యోగి, ఒక వైద్యుడు, ఒక వ్యవసాయ దారుడు, ఒక సర్వేయర్, ఒక ఇంజనీర్, ఒక కాంట్రాక్టర్, ప్రస్తుతము ఒక రచయిత, భవిష్యత్తులో. . . ?

ప్రస్తుతం శ్రీ కె. క్రిష్ణయ్య గారు రచించిన " పిల్లల పెంపక విజ్ఞానం పెద్దల బాధ్యత" అనే పుస్తకములో ఒక సందేశాత్మకమైన, బాధ్యతతో కూడిన, అంశాన్ని సమాజానికి తెలియజేస్తున్నారు.

కనడం అందరికీ తెలుసు - పెంచడం ఎందరికి తెలుసు? తెలిసినా ఎందరు అమలు చేయగలుగుతున్నారు? అమలు చేయకపోవడం వలన ప్రత్యక్షంగా ఆయా తల్లి దండ్రులకు, పరోక్షంగా సమాజానికి కలిగే అరిష్టాలెన్ని? ప్రస్తుతం సమాజంలో పెరిగి పోతున్న చట్టబద్ధం కాని పోకడలకు, వికృత చేష్టలకు ఎవరు బాధ్యులు?

పిల్లల్ని మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లి దండ్రులకు ఎంత బాధ్యత ఉందో అంతకు మించిన బాధ్యత ఉపాధ్యాయ లోకానిది. ప్రముఖ విద్యావేత్తయైన డా॥ కోఠారి గారి అభిప్రాయ ప్రకారము "A nations destiny is shaped in the class-room".

బీదవారు తమ బిడ్డలకు మంచి పోషకాహారాన్ని ఇవ్వలేకపోవచ్చు. అందువల్ల వారి బిడ్డలలో కొందరు అనారోగ్యం పాలు కావచ్చు. మరి ఆర్థిక బలము కలవారి బిడ్డలలో కూడా కొందరు శారీరక, మానసిక వ్యాధులకు గురియగుచున్నారు, ఎందువలన? అవగాహన లేకనా? ఉన్నా అమలు పరచకపోవడం వల్లనా? ఎందుకు అమలు పరచడం లేదు?

పై ప్రశ్నలన్నింటికి సమాధానములుగా శ్రీ కె. క్రిష్ణయ్య గారు ఎంతో శ్రమకోర్చి సమాజాభివృద్ధికి తన వంతు సేవ చేయాలి అనే బాధ్యతతో ఈ పుస్తకము వెలవరించారని నా అభిప్రాయము.

ఈ పుస్తకమందలి విషయములను ప్రతి తల్లి తండ్రి చదివి అవగాహన చేసుకొని ఆచరించిన యెడల తమ బిడ్డలలో అపూర్వమైన ప్రగతిని చూడవచ్చు. ర్యాంకుల బిడ్డలనే కాక, సంస్కారవంతమైన నీతి నిజాయితీ గల, క్రమశిక్షణతో కూడిన, వినయ విధేయతలు గల, బాధ్యతాయుతమైన, జ్ఞానవంతులైన బిడ్డలను ప్రతి తల్లిదండ్రి చూచి మురిసిపోవచ్చును. ఉపాధ్యాయ లోకము ఆనందించవచ్చును.

సమాజానికి ఇంత మంచి పుస్తకాన్ని అందించిన శ్రీ కె. క్రిష్ణయ్య గారు అభినంద నీయులు. ఇటువంటి మంచి పుస్తకములు ఇంకను వీరి కలం నుండి వెలువడ

**బి.శారద,** B.Sc., B.Ed.,
విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు, చిత్తూరు.

## అభిప్రాయం

65 సంవత్సరాల తరువాత విశ్రాంతి తీసుకోవలసిన వయస్సులో తనలోని రచయితను మేల్కొలిపి తనకంటూ వున్న ప్రత్యక శైలిలో అనేక రచనలు సాగించారు." పిల్లల పెంపక విజ్ఞానం పెద్దల బాధ్యత" అనే ఈ గ్రంథం ఆచరణ సాధ్యంగా వుంది. పిల్లల మేధస్సు మైనము వంటిది. పెద్దలు - తల్లిదండ్రులు - ఉపాధ్యాయులు పిల్లల మేధస్సును సరియైన పద్ధతిలో తీర్చిదిద్దాలనే ఆయన ఆకాంక్ష. తనలో వున్న ఆరాటాన్ని తనకు తెలిసిన విషయాలను, సేకరించిన పరిజ్ఞానాన్ని పనసతొనలు వొలచి పెట్టినట్లు మన ముందుం చారు.

"A strong mind in a Strong body" అన్నారు. అందుకే శ్రీ క్రిష్ణయ్య గారు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు ఆహారం, ఆరోగ్యం మరియు కుటుంబ పరిస్థితులు, పాఠశాల పరిసరాల ప్రభావం వుంటుందని వక్కాణించారు. మొదటి గురువైన తల్లి బిడ్డల అనుబంధం గురించి చక్కగా వివరించారు. పిండదశలో శబ్ధ గ్రహణం గురించి చక్కగా తెలిపారు. ఆహారపు అలవాట్లు, వయస్సు - బరువుకు తగ్గ పోషకాహారం విలువల గూర్చి తెలిపారు. మంచి ఆహారం, రక్షిత మంచినీరు, సమాజానికి అవసరమైన మానవతా విలువలను వివరించారు. మనిషి జీవితంలో బాల్యమే ప్రధానమైనది. కనుక బాలలను రక్షించాలి.

ప్రతి తల్లిదండ్రి ఈ పుస్తకాన్ని చదివి తమ పిల్లల భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకో వలెనని నా అభ్యర్థన మరియు సలహా.